epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

MEDIA

మెయిన్ : శనివారం - సెప్టెంబర్ 02- 2023 - పేజీలు : 3




# భారత స్వాతంత్ర్య సమరం

- ప్రపంచ చరిత్రలో ఒక మహెూన్నత పోరాటం
- ముఖ్యమంత్రి కేసీఆర్



**టి మీడియా, సెప్టెంబర్ 1.హైదరాబాద్ :** బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం సాగిన వీరోచిత స్వాతంత్ర్య సమరం ప్రపంచ చరిత్రలో ఒక మహెూన్నత పోరాటంగా నిలిచిపోయిందని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలకు హాజరైన అందరికీ హార్థిక శుభాకాంక్షలు తెలుపుతూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇది చాలా విశిష్టమైన సందర్భం. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాట చరిత్రనీ, స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను ధారపోసిన మహనీయుల త్యాగాలను ఘనంగా స్మరించుకోవటం ప్రతి భారతీయుని బాధ్యత. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను, ఆదర్శాలనూ, నేటి తరానికి తెలియజేయాలనే సత్సంకల్పంతో గత సంవత్సరం వజ్రోత్సవాల ప్రారంభ వేడుకలను ఎంతో ఘనంగా 15 రోజులపాటు నిర్వహించుకున్నాం. నేడు ముగింపు ఘట్టానికి చేరుకున్నాం. ఈ ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన అనేక కార్యక్రమాలలో రాష్ట్ర ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారని కేసీఆర్ తెలిపారు.

**గాంధీ చిత్రాన్ని వీక్షించిన 30 లక్షల మంది విద్యార్థులు**

30 లక్షల మంది విద్యార్థినీ విద్యార్థులకు మహాత్మాగాంధీ చలనచిత్రాన్ని చూపించినందుకు నాకు చాలా సంతోషంగా ఉందని కేసీఆర్ పేర్కొన్నారు. సమాచార ప్రజా సంబంధాల శాఖ, విద్యాశాఖల అధికారులు, సిబ్బంది ఈ పనిని ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. వారికి నా అభినందనలు అని సీఎం తెలిపారు.

**యావత్ ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచిన ఘనత మన దేశానిది..**

భారతదేశం మానవజాతి ఆవిర్భావ వికాసాలకు, ఉత్కృష్టమైన ఆధ్యాత్మిక తాత్విక చింతనకు, ఉన్నతమైన నాగరికతకు, సాంప్రదాయాలకు పుట్టినిల్లు అని కేసీఆర్ పేర్కొన్నారు. అతి ప్రాచీనకాలంలోనే యావత్ ప్రపంచానికీ మార్గదర్శిగా నిలిచిన ఘనత మన భారతదేశానిది. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం సాగిన వీరోచిత స్వాతంత్ర్య సమరం ప్రపంచ చరిత్రలో ఒక మహెూన్నత పోరాటంగా నిలిచిపోయింది. అనేక మంది మేధావులు దేశ ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు. స్వామి వివేకానంద భారతదేశ ఔన్నత్యాన్ని వివరించడం వల్ల భారతీయులలో జాతీయ స్పృహ రగిలింది. బ్రిటిష్ పాలన మన దేశానికి లాభదాయకమని, బ్రిటిషర్లు మన దేశాన్ని ఉద్ధరిస్తున్నారని నమ్మే దురాలోచనాపరులు ఆనాడు కూడా ఉండేవారు. విభిన్న సంస్కృతుల కలయిక అయిన భారతదేశాన్ని ఒక్కతాటి మీద నిలబెట్టింది స్వాతంత్ర సమరం అని కేసీఆర్ పేర్కొన్నారు.

గాంధీని ఎంతగానో ఆరాధించిన నెల్సన్ మండేలా ఈ విధంగా అన్నారు. "నైతికత, నిరాడంబరత, పేదల పట్ల ప్రేమలో మహాత్మాగాంధీ యొక్క స్థాయిని నేనెన్నటికీ అందుకోలేకపోయాను.

మిగతా.. 3

# నేడు ఆదిత్య ఎల్-1 ప్రయోగం

- లాంచ్ రిహార్సల్స్, అంతర్గత తనిఖీలు



**టి మీడియా, సెప్టెంబర్ 1,న్యూఢిల్లీ :** చంద్రయాన్ -3 విజయవంతమైన తర్వాత ఇస్రో మరో ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఈసారి సూర్యునిపై ఇస్రో ప్రయోగం చేయనుంది. సూర్యుడిపై అధ్యయనం చేయడానికి అంతరిక్ష ఆధారిత తొలి భారతీయ అబ్జర్వేటరీ ఆదిత్య ఎల్ -1 ప్రయోగానికి 11.50కి పిఎస్ఎల్వి-సి57 ప్రయోగం ప్రారంభించనున్నట్లు ఇస్రో తెలిపింది. ఈ ప్రయోగానికి సంబంధించి లాంచ్ రిహార్సల్స్, వాహన అంతర్గత తనిఖీలు అన్నీ ఇప్పటికే పూర్తయ్యాయని ఇస్రో శుక్రవారం వెల్లడించింది. ఈ ప్రయోగంలో సూర్యుని వివరణాత్మక అధ్యయనం కోసం ఏడు వేర్వేరు పేలోడ్‌లను కలిగి ఉంటుంది. వీటిలో నాలుగు పేలోడ్‌లు సూర్యుని నుండి వచ్చే కాంతిని గమనిస్తాయి. మిగిలిన మూడు ప్లాస్మా మరియు అయస్కాంత క్షేత్రాలను కొలుస్తాయి. ఆదిత్య ఎల్-1లో అతిపెద్ద సాంకేతిక సవాల్‌గా ఉండే పేలోడ్ విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనా గ్రాఫ్ (విఇఎల్‌సి) దీన్ని పరీక్షించినట్లు ఇస్రో తెలిపింది. భూమికి 1.5 మిలియన్ దూరంలో ఉన్న లాగ్రాంజియన్ పాయింట్ 1 (లేదా ఎల్1) చుట్టూ ఒక హాలో కక్ష్యలోకి ప్రయోగించబడుతుంది. ఈ కక్ష్య నుంచి సూర్యునికి చేరేందుకు సుమారు నాలుగు నెలలు సమయం పడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ ప్రయోగంలో అంతరిక్ష నౌక సౌర విస్ఫోటనం, సంఘటనలకు దారితీసే ప్రక్రియల క్రమాన్ని గుర్తించడంలో సహాయపడుతుంది. అంతరిక్ష వాతావరణంపై లోతైన అవగాహనకు ఈ ప్రయోగం దోహదం చేయనుందని ఇస్రో వెల్లడించింది. సోలార్ కరోనా యొక్క భౌతిక శాస్త్రం, దాని పని విధానం, సౌర గాలి, ఉష్ణోగ్రత, భూమికి సమీపంలోని అంతరిక్ష వాతావరణం వంటి విషయాలను తెలుసుకునే లక్ష్యాలుగా సన్ మిషన్ ప్రయోగం జరగనుందని ఇస్రో పేర్కొంది.

# వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేస్తాం

- 'ఇండియా' తీర్మానం

**టీ మీడియా, సెప్టెంబర్ 1, ముంబై :** వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సాధ్యమైనంత వరకు ఉమ్మడిగా పోటీ చేయాలని ప్రతిపక్ష కూటమి 'ఇండియా' శుక్రవారం తీర్మానం చేసింది. ప్రజా సమస్యలపై దేశంలోని వివిధ ప్రాంతాలలో వీలైనంత త్వరగా బహిరంగ ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించాయి. ఈ సందర్భంగా పార్టీలన్నీ ఐక్యంగా వివిధ భాషల్లో 'జుడేగా భారత్ .. జీతేగా ఇండియా' అనే థీమ్‌తో ప్రచార వ్యూహాలను సమన్వయం చేసుకుని పనిచేయనున్నట్లు తెలిపాయి. సెప్టెంబర్ 30 నాటికి సీట్ల సర్దుబాటు అంశాన్ని పూర్తి చేసేలా కలిసి పనిచేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎను గద్దె దించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ 'ఇండియా' కూటమిగా ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ కూటమి మూడో సమావేశం ముంబయిలో రెండో రోజూ కొనసాగుతోంది. 28 పార్టీలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. మోడీ ప్రభుత్వం నుండి మరిన్ని దాడులకు సిద్ధం కావాలని కూటమి పార్టీలనుద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్న సంగతి తెలిసిందే. రానున్న రోజుల్లో దర్యాప్తు సంస్థల దాడులకు, అరెస్టులకు సిద్ధం కావాలని అన్నారు. సమావేశంలో ముందుగా చంద్రయాన్-3 సాధించిన విజయానికిగాను ఇస్రోకు అభినందనలు తెలుపుతూ తీర్మానం విడుదల చేశారు. "మన దేశం గర్వపడేలా అద్భుతమైన విజయాలు సాధించిన ఇస్రో కుటుంబాన్ని మేము, భారతదేశ పార్టీలు మొత్తం అభినందిస్తున్నాము" అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. కాగా, ఒకే దేశం- ఒకే ఎన్నికలు ప్రతిపాదనపై కేంద్రం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు కీలక వర్గాలు




వెల్లడించాయి. సెప్టెంబర్ 18 నుండి 22 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం నుండి ప్రకటన వెలువడిన మరుసటి రోజు ఈ వార్తలు రావడం గమనార్హం.

# కౌలు రైతులకు పెట్టుబడి సాయం

- విడుదల చేసిన జగన్

**టి మీడియా, సెప్టెంబర్ 1, అమరావతి:** కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సహాయాన్ని ఏపీ సీఎం వైఎస్ జగన్ శుక్రవారంనాడు విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్చువల్ గా లబ్ధిదారులతో ఏపీ సీఎం జగన్ మాట్లాడుతూ, ఇప్పటివరకు కౌలు రైతులకు మొత్తం రూ. 1,122 కోట్లు పంపిణీ చేసినట్టుగా చెప్పారు.1,46,324 మంది కౌలు రైతులకు రూ. 109.74 కోట్ల పెట్టుబడి సహాయం అందిస్తామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు రైతులకు తోడుగా ఏపీ ప్రభుత్వం పెట్టుబడి సహాయం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.సీసీఆర్‌సీ కార్డులు పొంది కౌలు చేసుకుంటున్న రైతులకు తొలి విడత పెట్టుబడి సహాయం అందించినట్టుగా చెప్పారు.వైఎస్ఆర్ రైతు భరోసా ద్వారా 52 లక్షల 50వేల మంది రైతులకు మేలు కలుగుతుందని వివరించారు.ఏ సీజన్ లో పంట నష్టం జరిగితే అదే సీజన్ లో సహాయం చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది జూలై మాసంలో కురిసిన వర్షాలకు పంట నష్టానికి సహాయం అందించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. పంట పెట్టుబడికి రైతులు అప్పులు చేయాల్సిన అవసరం రాకుండా ఈ పథకం దోహదపడుతుందని చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు కల్తీలేని విత్తనాలను అందిస్తున్నామన్నారు.ఆర్‌బీకేల ద్వారా ఈక్రాప్ డేటా నమోదు చేస్తున్న విషయాన్ని సీఎం



ప్రస్తావించారు.పంటల భీమా ద్వారా రైతులకు అండగా ఉన్న విషయాన్ని సీఎం గుర్తు చేశారు.

# ఒకేదేశం-ఒకే ఎన్నికలు

- మాజీ రాష్ట్రపతి నేతృత్వంలో కమిటీ

**టి మీడియా, సెప్టెంబర్ 1,న్యూఢిల్లీ :** 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' ప్రతిపాదనపై కేంద్రం ఓ కమిటిని నియమించినట్లు కీలక వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పడినట్లు సమాచారం. సంబంధిత ప్రతిపాదనపై అధ్యయనం నిర్వహించి నివేదిక సమర్పించాల్సిందిగా కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి.సెప్టెంబరు 18 నుండి 22 వరకు (ఐదు రోజుల పాటు) పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రకటన వెలువడిన మరుసటి రోజే ఈ వార్త వెలువడటం గమనార్హం. ఈ ప్రత్యేక సమావేశాల్లో ఒకే దేశం -



ఒకే ఎన్నికలు బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే అంశంపై కేంద్రం నుండి అధికారిక ప్రకటన వెలువడాల్సి వుందిఒకే దేశం-ఒకే ఎన్నికలులో భాగంగా దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. మోడీ ప్రభుత్వం పలు మార్లు ఈ అంశం గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. 2014 లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి మానిఫెస్టోలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది.అయితే ఈ ప్రతిపాదన కోసం రాజ్యాంగ సవరణ అవసరమని, లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.ఐదు రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గడ్, తెలంగాణ, మిజోరాంలలో ఈ ఏడాది నవంబర్-డిసెంబర్‌ల మధ్య అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే వచ్చే ఏడాది మేలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి.

# కోటీ 18 లక్షల మంది ఒక్క సిలిండరూ కొనలేదు

- ప్రతి నలుగురిలో ఒకరు ఒక్కటీ తీసుకోలేదు
- గ్యాస్ కొనలేకపోతున్న ఉజ్వల యోజన లబ్ధిదారులు

**టి మీడియా, సెప్టెంబర్ 1, న్యూఢిల్లీ :** భారీగా పెరుగుతున్న ఎల్‌పిజి సిలిండర్ ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంతోనే రూ.200 రాయితీ ఉన్నా 202223లో ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) లబ్ధిదారుల్లో ప్రతి నలుగురిలో ఒకరు ఒక్క సిలిండర్ కూడా తీసుకోలేదు. లేదా కేవలం ఒక్క సిలిండర్ మాత్రమే తీసుకున్నారు. రాయితీ ఉన్నా.. పిఎంయువైలో ఒక్క సిలిండర్ ధర రూ.903గా ఉంది. కాబట్టే ప్రతి తొమ్మిది మంది పిఎంయువై లబ్ధిదారుల్లో ఒకరు అంటే 1.18 కోట్ల మంది గత ఏడాదిలో ఒక్క సిలిండర్ తీసుకోలేదు. ప్రతి నలుగురిలో ఒకరు అంటే 1.51 కోట్ల మంది ఒకే ఒక్క సిలిండర్‌ను తీసుకున్నారు. సమాచార హక్కు (ఆర్‌టిఐ) ద్వారా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసిఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) నుంచి సేకరించిన సమాచారంతో ఈ విషయం వెల్లడయింది. మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్రశేఖర్ గౌర్ ఈ సమాచారం సేకరించారు. పిఎంయువై పథకం ప్రారంభమైన దగ్గర నుంచి 2023 మార్చి వరకూ పై మూడు కంపెనీలు ఈ పథకం కింద 9.58 కోట్ల ఎల్‌పిజి కనెక్షన్లు ఇచ్చాయి. మొత్తంగా రూ.6,664 కోట్ల విలువైన సబ్సిడీలను మంజూరు చేశాయి.



2018 జనవరి నుంచి 2023 మార్చి వరకూ పిఎంయువై సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పోలిస్తే ఈ ధరలు 82 శాతం పెరిగాయి. 2018 జనవరిలో ఈ ధర రూ.495.64గా ఉంది. మార్చి 2023 నాటికి ఈ ధర రూ.903కు పెరిగింది. తాజాగా కేంద్రం ప్రకటించిన రూ.200 తగ్గింపును పరిగణనలోకి తీసుకుంటే ఈ ధర రూ.703 అవుతుంది. సమాచారహక్కు ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం 202223లో ఏ ఒక్క పిఎంయువై లబ్ధిదారుడు కూడా నాలుగు కంటే ఎక్కువ ఎల్‌పిజి సిలిండర్లు తీసుకోలేదు. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం దేశంలో మొత్తంగా 31 కోట్ల మంది కంటే ఎక్కువ గృహ ఎల్‌పిజి వినియోగదారులు ఉన్నారు. వీరిలో 9.58 కోట్ల మంది పిఎంయువై లబ్ధిదారులు. సబ్సిడీ లేని ఎల్‌పిజి సిలిండర్ ధర కూడా మోడీ పాలనలో భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. 2018 జనవరి నాటికి రూ.741గా ఉన్న 14.2 కేజీల సిలిండర్ ధర ఈ ఏడాది మార్చి నాటికి 49 శాతం పెరిగి రూ.1,103కు చేరుకుంది. (దేశరాజధానిలో ధరల ప్రకారం). కేంద్రం ఇటీవల ప్రకటించిన రూ.200 అందరికీ వర్తిస్తుంది కాబట్టి ఈ ధర ఇప్పుడు రూ. 903 అవుతుంది.

## వారంలో మూడు రోజులు 'వర్క్ ఫ్రమ్ ఆఫీస్'

### - అమెజాన్




**టీ మీడియా, సెప్టెంబర్ 1, వాషింగ్టన్ :** ఇకపై ఉద్యోగులు వారంలో మూడు రోజులు ఆఫీస్ నుండి పనిచేయాలని అమెజాన్ శుక్రవారం ఆదేశించింది. ఉద్యోగులు విభేదించినప్పటికీ... నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని అమెజాన్ సిఇఒ ఆండీ జస్సే పేర్కొన్నారు. ఆగస్టులో జరిగిన అంతర్గత సమావేశంలో వచ్చిన వ్యాఖ్యలను ఇన్‌సైడర్ అనే వార్తా సంస్థ మొదట నివేదించింది. మే నుండి వేలాది మంది ఉద్యోగులను తిరిగి కార్యాలయాలకు రప్పించాలని అమెజాన్ యత్నిస్తున్నట్లు జస్సే ఫిబ్రవరి 17న బ్లాగ్‌లో రాసుకొచ్చారు. ఉద్యోగులు కార్యాలయంలో వర్క్ చేసినప్పుడు మెరుగైన సహకారంతో పాటు మరింత శిక్షణ పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఒకరి నుండి మరొకరు వ్యక్తిగతంగా నేర్చుకోవడం సులభంగా వుంటుందని, ఎదురైన సవాలును ఎలా పరిష్కరించారో ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు అని పేర్కొన్నారు. ఈ ఏడాది అమెజాన్ 25,000 మందికి పైగా ఉద్యోగులపై వేటు వేసింది. మెటా, గూగుల్, ఎక్స్ (ట్విటర్) జూమ్ వంటి టెక్ కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాన్ని కల్పించాయి. ఇక కార్యాలయాలకు రావాలని, కనీసం వారంలో మూడు రోజులైనా ఆఫీసు నుండి పనిచేయాలని ఆదేశిస్తున్నాయి.

## విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు హైకోర్టు అనుమతి




**టీ మీడియా, సెప్టెంబర్ 1, అమరావతి:** డిమాండ్ల పరిష్కారం కోసం విద్యుత్ కార్మిక సంఘాలు విజయవాడలో నిర్వహించబోయే ధర్నాకు ఏపీ హైకోర్టు అనుమతి ఇచ్చింది. ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరుతూ విద్యుత్ సంఘాలు వేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం విచారణ జరిపి షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేసింది. ఈనెల 10న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30గంటలలోపు ధర్నా చేసుకోవాలని ఉద్యోగుల సంఘానికి సూచించింది.

ధర్నా నిర్వహించేందుకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని సవాలు చేస్తూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, ఏపీ విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్, ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## వైఎస్ వివేకా హత్య కేసు విచారణ వాయిదా



**టీ మీడియా, సెప్టెంబర్ 1, హైదరాబాద్ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణను సీబీఐ కోర్టు ఈనెల 22కు వాయిదా వేసింది. హైదరాబాద్ సీబీఐ కోర్టులో జరుగుతున్న విచారణలో 8 మంది నిందితుల తరుపున వాదిస్తున్న న్యాయవాదులు తమకు సీబీఐ వేసిన అనుబంధ అభియోగ పత్రాలు ఇవ్వాలని కోర్టును కోరారు. అయితే 20వేల పేజీల హార్డ్ కాపీలు ఇవ్వడం కష్టమవుతుందని డిజిటల్ కాపీలు ఇస్తామని సీబీఐ తరపు న్యాయవాది వెల్లడించారు. తమకు జిరాక్స్ కాపీలు ఇవ్వాలని నిందితుల తరుపు నాయ్యవాదులు విజ్ఞప్తి చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సాఫ్ట్‌కాపీ రూపంలో ఇస్తామన్న సీబీఐ కోర్టు స్పష్టం చేసింది.

## మరో దిగ్గజ కంపెనీ వేదాంత

### -అక్రమాలను బయటపెట్టిన ఒసిసిఆర్‌పి




**టి మీడియా, సెప్టెంబర్ 1, న్యూఢిల్లీ :** మరో దిగ్గజ కంపెనీ వేదాంత గ్రూప్ అక్రమాలను ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఒసిసిఆర్‌పి) శుక్రవారం బట్టబయలు చేసింది. కరోనా మహమ్మారి సమయంలో కీలక పర్యావరణ నిబంధనలను బలహీనపరిచేలా వేదాంత రహస్య లాబీయింగ్ నిర్వహించినట్లు ఒసిసిఆర్‌పి నివేదిక తెలిపింది. ప్రజల నుండి అభిప్రాయ సేకరణ చేయకుండానే మోడీ ప్రభుత్వం అక్రమ పద్ధతుల్లో ఈ మార్పులను ఆమోదించిందని వెల్లడించింది. ఓ సందర్భంలో నూతన పర్యావరణ అనుమతులు లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తి చేయగలవని వేదాంత కంపెనీ వాదించినట్లు నివేదిక పేర్కొంది. వేదాంతకు చెందిన ఆయిల్ కంపెనీ కెయిర్న్ ఇండియా ప్రభుత్వ వేలంలో గెలిచిన చమురు బ్లాక్‌లలో డ్రిల్లింగ్ కోసం బహిరంగ విచారణ లేకుండా లాబీయింగ్ నిర్వహించినట్లు తెలిపింది. అప్పటి నుండి స్థానికంగా పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉన్నప్పటికీ.. రాజస్తాన్‌లో కెయిర్న్ సంస్థకు ఆరు వివాదాస్పద చమురు బ్లాక్‌లను ఆమోదించినట్లు వెల్లడించింది. లాభాపేక్ష లేని సంస్థ అయిన ఒసిసిఆర్‌పి గురువారం అదానీ గ్రూపు అక్రమాలను వెలికితీసిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ తన కంపెనీల స్టాక్‌ధరలను తారుమారు చేసి, వాటి ఆస్తుల విలువలను అడ్డగోలుగా పెంచేందుకు అక్రమాలకు పాల్పడిందన్న ఆధారాలను వెల్లడించింది.

## 2035 నాటికి 42.5 కోట్లకు విమాన ప్రయాణికులు

### - మంత్రి జ్యోతిరాదిత్య సింధియా




**టి మీడియా, సెప్టెంబర్ 1,న్యూఢిల్లీ :** 2035 నాటికి భారత్‌లో విమాన ప్రయాణికుల సంఖ్య 42.5 కోట్లకు చేరవచ్చని పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం ఈ సంఖ్య 14.5 కోట్లుగా ఉందని అన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులు దృష్టి సారించేలా విమానయాన రంగం అభివృద్ధి సాధించిందని అన్నారు. కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండిస్టీ (సిఐఐ) శుక్రవారం గ్వాలియర్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఏరోస్పేస్ కాన్ఫరెన్స్‌లో సింధియా మాట్లాడుతూ... ప్రాంతీయ కనెక్టివిటీ ప్రజల విమాన ప్రయాణాన్ని సులభతరం చేసిందని అన్నారు. ప్రస్తుతం నాలుగు ప్రాంతీయ విమానాశ్రయాలను ఏర్పాటు చేయగలిగామని చెప్పారు. ఈ సందర్భంగా దేశ పౌర విమానయాన రంగం సాధించిన సామర్థ్యాన్ని ప్రశంసించారు. అలాగే అంతర్జాతీయ క్రీడాకారులు భారత్‌ని ఎంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. పౌర విమానయానాన్ని సేవగా, ఉత్పత్తిగా వృద్ధి చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. జులైలో దేశీయ విమానాల రాకపోకలు 25 శాతం పెరిగి 1.21కోట్ల మంది ప్రయాణికులకు చేరుకున్నట్లు అధికారిక సమాచారం.

## జీవిత లక్ష్యం ముందుగానే నిర్ణయించుకోవాలి

### - ఆకుల శ్రీనివాస్ సాయి



**టి మీడియా, సెప్టెంబర్ 1, హుజూర్ నగర్ :** కొద్ది రోజులుగా ప్రజలందరూ సంతోషిస్తున్నటువంటి చంద్రయాన్ 3 విజయం. అందులో భాగంగానే ప్రముఖ అనలాగ్ ఆస్ట్రోనాట్ అయిన ఆకుల మోహన్ సాయి చే శుక్రవారం ఎం డి ఆర్ హై స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనలాగ్ ఆస్ట్రోనాట్ ఆకుల మోహన్ సాయి ఎం డి ఆర్ హై స్కూల్ నందు తన యొక్క పాఠశాల విద్యను పూర్తి చేసుకోవడం జరిగింది. అందులో భాగంగా ఎం డి ఆర్ విద్యాసంస్థ చైర్మన్ మేరెడ్డి దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. మేము విద్యాసంస్థలు ప్రారంభించి దాదాపుగా 40 సంవత్సరాలు దాటినదని, దాదాపుగా మా దగ్గర నుంచి చదువుకున్న విద్యార్థులు భావి భారతదేశానికి ఆదర్శప్రాయంగా నిలిచారని, అందులో ఒకరైనటువంటి మోహన్ సాయి మా విద్యాసంస్థలో చదువుకోవడం మాకు గర్వకారణమని, ఇప్పుడు ఉన్నటువంటి విద్యార్థులు మోహన్ సాయిని ఆదర్శంగా తీసుకొని మంచి భవిష్యత్తును నిర్ణయించుకోవాలని అన్నారు. ఈ సభాముఖంగా పేర్కొంటున్నాను మరియు ఈ సభను ఉద్దేశిస్తూ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ నలబోలు భూపాల్ రెడ్డి గారు మోహన్ సాయి లాంటి విద్యార్థులు మునుపెన్నడు చూడలేదని సభాముఖంగా పేర్కొన్నారు మరియు ఆకుల మోహన్ సాయి ఉన్నత శిఖరాగ్రానికి చేరుకోవాలని ఆశిస్తూ ఇప్పుడున్నటువంటి విద్యార్థులు కూడా మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా మోహన్ సాయి తన ఈ అనలాగ్ ఆస్ట్రోనాట్ ప్రయాణాన్ని ఏ విధంగా మొదలుపెట్టాడో విద్యార్థులకు కులంకుషంగా వివరించాడు. అయితే పాఠశాల దశ నుంచి తనకు ఇటువంటి కార్యకలాపాల మీద ఆసక్తి ఎక్కువగా ఉండటం వల్ల తను తన గమ్యాన్ని చేరుకున్నాడని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కూడా వారి భవిష్యత్తును ఈ రోజు నుండే తాము ఏం కావాలనుకుంటారో ముందుగానే దిశా నిర్దేశం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎండిఆర్ స్కూల్ యాజమాన్యం శ్రీనివాస్ సాయి ని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస్ సాయి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నిరంకుశ సర్కార్ పతనానికి కౌంట్‌డౌన్ షురూ

### - మల్లికార్జున్ ఖర్గే



**టీ మీడియా, సెప్టెంబర్ 1, ముంబై :** నరేంద్ర మోదీ సారధ్యంలో కేంద్రంలోని ఎన్‌డీయే నిరంకుశ సర్కార్ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ముంబైలో జరుగుతున్న విపక్ష కూటమి ఇండియా భేటీకి సంబంధించిన ఫొటోలను ట్విట్టర్‌లో షేర్ చేసిన ఖర్గే ఇండియా సమైక్యంగా నిలిచింది..ఇండియా విజేతగా నిలుస్తుందని క్యాప్షన్ ఇచ్చారు. పురోగామి, సంక్షేమ, సమ్మిళిత ఇండియా కోసం తాము కలిసికట్టుగా నిలిచామని ఖర్గే రాసుకొచ్చారు. దేశంలో మార్పు అవసరమని 140 కోట్ల భారతీయులు నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ నిరంకుశ సర్కార్ పతనానికి కౌంట్‌డౌన్ ఆరంభమైందని పేర్కొన్నారు. ఇక రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జట్టుగా కలిసికట్టుగా పనిచేయాలని పలు తీర్మానాలు చేసిన విపక్ష ఇండియా సమావేశంలో కీలక కమిటీలనూ ఏర్పాటు చేశారు. 12 మంది సభ్యులతో కూడిన సమన్వయ కమిటీని నియమించామని భేటీ అనంతరం శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ వెల్లడించారు. సమన్వయ కమిటీలో కేసీ వేణుగోపాల్ (కాంగ్రెస్), శరద్ పవార్ (ఎన్సీపీ), టీఆర్ బాలు (డీఎంకే), హేమంత్ సోరెన్ (జేఎంఎం), సంజయ్ రౌత్ (ఎస్ఎస్-యూబీటీ), తేజస్వి యాదవ్ (ఆర్జేడీ), అభిషేక్ బెనర్జీ (టీఎంసీ), రాఘవ్ చద్దా (ఆప్), జావేద్ అలీ ఖాన్ (ఎస్పీ), లలన్ సింగ్ (జేడీయూ), డీ. రాజా (సీపీఐ), ఒమర్ అబ్దుల్లా (ఎన్‌సీ), మెహబూబా ముఫ్తీ (పీడీపీ), సీపీఎం నుంచి మరో సభ్యుడు ఉంటారని రౌత్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన సభ్యులతో కూడిన నాలుగు ప్రధాన కమిటీలను ఈ సమావేశంలో ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రచార కమిటీ, సోషల్ మీడియా వర్కింగ్ గ్రూప్ కమిటీ, మీడియా కమిటీ, రీసెర్చ్ కమిటీలను కూడా నియమించామని తెలిపారు. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని ఈ సమావేశంలో విపక్ష ఇండియా కూటమి నిర్ణయించింది.

## 10 నుండి 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

### -1 నుండి 7 వరకు జరిగే ప్రజా ఆందోళన పోరాటాలలో పాల్గొనండి

### -సిపిఐ (ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




**టీ మీడియా, సెప్టెంబర్ 1, ఖమ్మం:** సెప్టెంబర్ 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా సిపిఎం కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను నిర్వహించాలని నిర్ణయించిందని1 సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం పేదల నడ్డి విరిచే విధంగా నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతోందని ఆయన విమర్శించారు. ధరల నియంత్రణలో కేంద్రం పూర్తిగా విఫలం అవుతుందని అన్నారు. కార్పొరేట్ వ్యాపారవర్గానికి మేలు చేసే పద్ధతిలోనే కేంద్ర ప్రభుత్వ పాలన సాగుతోందని తెలిపారు, పేద, మధ్య తరగతి ప్రజల బాధలను, సమస్యలను, విధానాలను అమలు పరుస్తూనే, మరోవైపు ప్రమాదకర మతోన్మాద రాజకీయాలను ముందుకు తెస్తోందని తెలిపారు. దీనివలన ప్రజల మధ్య వైషమ్యాలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సైతం ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని విమర్శించారు. సంక్షేమ పథకాల పేర ప్రచార ఆర్భాటాలు తప్పి, ప్రజల దైనందిన, దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడంలో విఫలమవుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 1 నుండి 7వ తేదీ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం దేశవ్యాపిత పోరాటాలను నిర్వహిస్తోందని, ఈ ప్రజా పోరాటాలలో ప్రజలు అత్యధికంగా పాల్గొనాలని ఆయన కోరారు. అలాగే ఈ నెల 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను తెలంగాణలోని ప్రతి పల్లెలో, పట్టణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. భూమి, భుక్తి, వెట్టి నుండి విముక్తి, ఆత్మ గౌరవ జీవనం వంటి నినాదాలతో జరిగిన చారిత్రిక పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం సైతం అధికారికంగా వారోత్సవాల పేరు మీద ప్రజలను వివరించాలని కోరారు. మన ప్రాంత ఘనమైన చరిత్రను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని అన్నారు. సిపిఎం నిర్వహించే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో ప్రజలు విస్తృతంగా పాల్గొని, తమ పూర్వీకుల పోరాట త్యాగాలను స్మరించుకోవాలని, ఆ పోరాట స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. నాటి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలు ప్రస్తుత ప్రభుత్వాల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, రాష్ట్ర కమిటి సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, బండి రమేష్, చింతలచెర్వు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిస్వార్థ రాజకీయానికై రఘు రాజకీయ రంగ ప్రవేశం

### - ఓజో ఫౌండేషన్ ఇంచార్జ్ కుక్కల వెంకన్న



**టి మీడియా, సెప్టెంబర్ 1, హుజూర్ నగర్ :** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ పట్టణం కేంద్రం లోని 15 వార్డ్ తిలక్ నగర్ కి చెందిన కుడితెట్టి ఆంద్రపాల్ లివర్, కిడ్నీ పాడై చనిపోవడంతో కాలనీ వాసులు ఆర్థిక సాయం అందించాలని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘును సంప్రదించగా వెంటనే స్పందించి ఓజో నియోజకవర్గ ఇంచార్జ్ కుక్కల వెంకన్న ను అట్టి కుటుంబం వద్దకు పంపించి 5,000 ఆర్థిక సహాయం అందించడం జరిగింది. అదేవిధంగా తిలక్ నగర్ చెందిన కుడితెట్టి నాగార్జున చెట్టు మీద నుంచి పడి వెన్నెపూస విరగడంతో అతనికి కూడ 5000 రూపాయలు, మొత్తం పదివేలరూపాయిలు ఓజో ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇంచార్జ్ కుక్కల వెంకన్న మాట్లాడుతూ..హంగు, ఆర్భాటం లేకుండా అదిచేశాం,ఇది చేశాం అనే సుత్తి లేకుండా పిల్లుట్ల రఘు చేస్తున్న కార్యక్రమాలు నిరంతరం ఇవాళ ప్రతి పల్లె, ప్రతి గ్రామం, ప్రతి పట్టణం ఎదురు చూసేది పిల్లుట్ల రఘు కోసమేనని, అధికారంలో లేకుండానే ఎన్నో గొప్ప సేవా కార్యక్రమలు చేశాడని, అధికారంలో ఉంటే ఇంకా ఎన్ని మంచి పనులు చేస్తాడని, ఒకసారి ఆలోచన చేసి,రాబోయే కాలంలో సేవా భావాలున్న వ్యక్తిగా పిల్లుట్ల రఘును ఎమ్మెల్యే గా గెలిపించుకోవాలని కుక్కల వెంకన్న అన్నారు. ఈ కార్యక్రమం లో, దగ్గుపాటి బాబురావు, ఆవులపాటి శ్రీను, నేమ్మోజు సాయి విరాట్,తిరుపతి,కాకునూరి శివారెడ్డి, బొమ్మకంటి సైదులు ముదిరాజ్, జోష్ గౌడ్,పెండం వినయ్ గౌడ్,పిల్లుట్ల సునీల్, వీర్ల అంజి,నరేందర్,ఓజో ఫౌండేషన్ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీయే లక్ష్యంగా ఆత్మాహుతి దాడి..

### - 9 మంది పాక్ సైనికులు మృతి



**టి మీడియా, సెప్టెంబర్ 1, న్యూఢిల్లీ :** పాకిస్థాన్ లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. ఆర్మీయే లక్ష్యంగా ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తొమ్మిది మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఖైబర్ ఫంఖ్తుఖ్వా ప్రావిన్స్ లోని బన్నూ జిల్లాలో ఈ దారుణం చోటు చేసుకుంది. ఆత్మాహుతి బాంబర్ మోటార్ సైకిల్‌పై భద్రతా అధికారుల వాహనానికి ఎదురెళ్లి తనను తాను కాల్చుకున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనపై పాకిస్థాన్ తాత్కాలిక పీఎం అన్వర్ ఉల్ హక్ కకర్ విచారం వ్యక్తం చేశారు. 'బన్నూ డివిజన్‌లో టెర్రరిస్టుల ఆత్మాహుతి దాడిలో 9 మంది సైనికులు మృతి చెందారనే వార్త విని గుండె పగిలింది. అలాంటి చర్యలను ఖండిస్తున్నాను. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ దృఢంగా ఉంది' అని తెలిపారు. కాగా, ఈ దాడికి నిషేధిత తెహ్రీక్ - ఏ - తాలిబన్ పాకిస్థాన్ సంస్థ బాధ్యత వహించింది. కాగా, ఖైబర్ ఫంఖ్తుఖ్వా ప్రావిన్స్ ప్రాంతంలో నెల రోజుల వ్యవధిలో ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి. ఈ ఏడాది జులై 30వ తేదీన ఓ రాజకీయ పార్టీ సమావేశంలో ఆత్మాహుతి బాంబర్ పేలుడుకు పాల్పడటంతో 54 మంది మరణించారు. సుమారు 200 మందికిపైగా గాయపడ్డారు.

## 125 రోజుల్లో ఎల్1 పాయింట్‌కు ఆదిత్య

### - ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్




**టి మీడియా, సెప్టెంబర్ 1, హైదరాబాద్:** సూర్యుడి స్టడీ కోసం ఆదిత్య ఎల్1 మిషన్‌ను ఇస్రో ప్రయోగించనున్న విషయం తెలిసిందే. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ సెంటర్ నుంచి ఈరోజు ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయం ఆ ప్రయోగం కోసం కౌంట్‌డౌన్ స్టార్ట్ చేశారు. అయితే ఆదిత్య ఎల్1 మిషన్ గురించి ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ మరికొన్ని అప్‌డేట్స్ ఇచ్చారు. ఎల్1 పాయింట్ చేరుకునేందుకు ఆదిత్యకు 125 రోజుల సమయం పడుతుందని ఆయన వెల్లడించారు. భూమి నుంచి సుమారు 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఎల్1 పాయింట్ కక్ష్య ఉన్న విషయం తెలిసిందే. అక్కడి నుంచే సూర్యుడిని ఆదిత్య స్టడీ చేయనున్నది. సూర్యుడి అధ్యయనం కోసమే ఆదిత్యను లాంచ్ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆదిత్య ప్రయోగం చాలా కీలకమైందన్నారు. చంద్రయాన్-4కు సంబంధించిన అంశంపై ఇంకా డిసైడ్ కాలేదన్నారు. దీనిపై త్వరలోనే తేదీని ప్రకటించనున్నట్లు ఆయన చెప్పారు. ఆదిత్య ఎల్1 తర్వాత గగన్‌యాన్ ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ మొదటి వారంలో గగన్‌యాన్ ప్రయోగం ఉంటుందని సోమనాథ్ వెల్లడించారు. చంద్రయాన్-3కి చెందిన ప్రజ్ఞాన్ రోవర్ మంచిగా వాకింగ్ చేస్తున్నట్లు ఇస్రో చీఫ్ చెప్పారు. సెప్టెంబర్ 13వ తేదీ వరకు అంతా సవ్యంగా సాగుతుందని ఆయన వెల్లడించారు.

## మా మద్దతు ఎమ్మెల్యే సైదన్నకే

### - సెర్ప్ విఓఏ లు



**టీ మీడియా, సెప్టెంబర్ 1, హుజూర్ నగర్ :** ప్రభుత్వం తమ గౌరవ వేతనాలను 8000 లకి పెంచినందుకు గాను శుక్రవారం గరిడేపల్లి మండల సెర్ప్ విఓఏ స్రవంతి ఆధ్వర్యంలో సెర్ప్ విఓఏ లు హుజూర్ నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ని శాలువ కప్పి పుష్ప గుచ్చం ఇచ్చి సన్మానించారు ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. మా గురించి మొదటిగా అసెంబ్లీబ్లో మాట్లాడింది మా సైదన్న మాత్రమే అని.. గౌరవ వేతనాల పెంపు లో కూడా ఎంతో సపోర్ట్ చేసారని, తెలంగాణ ప్రభుత్వం 30 శాతం పిఆర్సీ ఇచ్చిందన, ఇప్పుడు 8000 జీతం పెంచింది అని,త్వరలో వేసే పిఆర్సీ ద్వారా మరింత గా జీతాలు పెరుగుతాయని,కనుక ఎల్లప్పుడూ మా మద్దుతూ మా ప్రియతమ నేత స్థానిక శాసన సభ్యులు.హుజర్నగర్ ముద్దుబిడ్డ శానంపూడి సైదిరెడ్డికేనని,రాబోవు ఎన్నికలలో బారి మెజారిటీతో గెలిపిస్తామని ఈ సందర్భంగా తెలియజేసారు.

## ఆ పిల్లలకు కూడా తల్లితండ్రుల ఆస్తిలో వాటా ఉంటుంది

### - సుప్రీంకోర్టు



**టీ మీడియా, సెప్టెంబర్ 1, న్యూఢిల్లీ:** గుర్తింపు లేని పెళ్లి చేసుకున్న వారికి పుట్టిన పిల్లలకు.. తల్లితండ్రుల ఆస్తిలో వాటా ఇవ్వాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది. అక్రమ పెళ్లి చేసుకున్న జంటకు కలిగే సంతానానికి చట్టపరమైన హక్కులు వర్తిస్తాయని శుక్రవారం కోర్టు వెల్లడించింది. హిందూ వారసత్వ చట్టం ప్రకారం .. గుర్తింపు లేని పెళ్లి చేసుకున్న వారికి కలిగే సంతానం కూడా తమ పేరెంట్స్ ప్రాపర్టీని పొందే హక్కు ఉంటుందని కోర్టు చెప్పింది. 2011లో దాఖలైన ఓ పిటీషన్‌పై ఇటీవల సీజేఐ డీవై చంద్రచూడ్ తో కూడిన ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసంది. హిందూ వివాహ చట్టం ప్రకారం ఆస్తుల పంపకంపై 2011లో రెండు జడ్జిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే గుర్తింపులేని పెళ్లి చేసుకున్న వారికి కలిగిన పిల్లలకు ఎటువంటి హక్కులు వర్తించవు అని అప్పట్లో తీర్పు చెప్పారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ఆ తీర్పును వ్యతిరేకిస్తూ కొత్త తీర్పును వెలువరించింది.

# 11,700 మందికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు

- మంత్రి తలసాని



**టి మీడియా, సెప్టెంబర్ 1, హైదరాబాద్:** జీహెచ్ఎంసీ పరిధిలో ఒకే రోజు 11,700 డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్ల పత్రాలను అందిస్తామన్నారు. దీనికి సంబంధించి నగరంలోని తొమ్మిదిచోట్ల లాటరీ ప్రాతిపదికన డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. జీహెచ్ఎంసీ కార్యాలయంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మితో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గానికి 500 చొప్పున ఇండ్లను లబ్ధిదారులకు కేటాయిస్తున్నామన్నారు. లబ్ధిదారులను తీసుకొచ్చేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని చెప్పారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఉండదని స్పష్టం చేశారు. పేదలకు అన్ని సౌకర్యాలతో ఇలాంటి ఇండ్లు ఇవ్వడం గొప్ప విషయమని వెల్లడించారు. మంత్రి హరీశ్ రావుతోపాటు డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహేందర్ రెడ్డి, మల్లారెడ్డి, మహమూద్ అలీ, మేయర్ విజయ లక్ష్మి లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ చేస్తారని తెలిపారు.

## ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసిన అంగన్వాడీ టీచర్ల రాష్ట్ర నాయకులు



**టి మీడియా, సెప్టెంబర్ 1, హుజూర్ నగర్ :**
హుజర్నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని శుక్రవారం అంగన్వాడీ టీచర్ల రాష్ట్ర, జిల్లా నాయకులు మర్యాద పూర్వకముగా కలిసి పుష్పగుచ్చంతొ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ..మళ్ళీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ వచ్చినందుకు చాలా సంతోషంగా వున్నదని,బారి మెజారిటీ తో మళ్ళీ మన సైదన్ననే గెలుస్తారని, అంగన్వాడీ మహిళ ప్రపంచం మొత్తం సైదన్న వెంటే వున్నదని, అభివృద్ధి కి మరో రూపం మన సైదన్న అని, సైదన్న కి తప్ప మరెవ్వరికి ఓటు అడిగే అర్హత కూడా లేదు అని ఈ సందర్భంగా వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ రాష్ట్ర నాయకురాలు విలసకవి నిర్మల ,జిల్లా అధ్యక్షురాలు నాగలక్ష్మి. ప్రాజెక్టు అధ్యక్షురాళ్లు శాంతరాజ్యం, రాములమ్మ,జారిన సుజాత, సరిత, ఇమాంబి, జవలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కనిపించని బీజేపీ

- బీఆర్ఎస్ ముఖ్యమంత్రి అభ్యర్థి కేసీఆర్
- జగిత్యాలకు జీవన్‌రెడ్డి చేసిందేమీ లేదు
- కార్యకర్తల సమావేశంలో కల్వకుంట్ల కవిత



**టీ మీడియా, సెప్టెంబర్ 1, హైదరాబాద్ :** తెలంగాణవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఎకడాలేదని, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన జగిత్యాల కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'రాబోయే రోజుల్లో కాబోయే ఎమ్మెల్యే సంజయ్' అనే నినాదం స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. గత ఎన్నికల్లో జగిత్యాల అడ్డాపై బీఆర్ఎస్ జెండా ఎగరడం చాలా సంతోషకరమని చెప్పారు. కరోనా సమయంలో విశేష సేవ చేసిన ఎమ్మెల్యే సంజయ్‌ని ఆమె అభినందించారు. ఎమ్మెల్సీ రమణ సమన్వయంతో సంజయ్‌కుమార్ తప్పకుండా మరోసారి అద్భుతమైన మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నుంచి వెళ్లిపోయినవాళ్ల గురించి ఆలోచించవద్దని ఈ సందర్భంగా కవిత స్పష్టం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్‌తోనే బీఆర్ఎస్‌కు పోటీ అని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గానికి జీవన్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు.

# విపక్షాలను నమ్మితే అధోగతే

- లక్ష సాయంతో వరర్ టు ఓనర్
- ప్రతినెలా లబ్ధిదారులకు చెకులు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల



**టీ మీడియా, సెప్టెంబర్ 1, కరీంనగర్:** అన్ని వర్గాలు, మతాల అభ్యున్నతి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ కోరారు. ఎన్నికలు సమీపిస్తున్నందున కొన్ని శక్తులు తప్పుడు వాగ్దానాలతో వస్తున్నాయని, వాటిని నమ్మి అధికారం అప్పగిస్తే తెలంగాణ సంపదను దోచుకుంటాయని దుయ్యబట్టారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలంటే బీఆర్ఎస్‌ను కొనసాగించాలని కోరారు. కనుమరుగైన కుల వృత్తులు, చేతివృత్తులను కాపాడాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నారని చెప్పారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ కుల, చేతివృత్తులకు సంబంధించి 705 మందికి రూ.లక్ష చొప్పున చెక్కు లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు కులవృత్తులకు సరైన ఆదరణ లేకపోవడంతో ఉపాధి కరువై ఉన్న ఊరిని, నమ్ముకున్న వృత్తిని వదిలి బొం బాయి, ఇతర ప్రాంతాలకు వలసపోయి కూలీ పనులు చేసుకునే పరిస్థితులు ఉండేవన్నారు. దళిత బంధు ద్వారా లబ్ధిపొంది క్లీనర్లు ఓనర్లుగా మారిన విధంగానే బీసీ చేయూతతో వరర్ టు ఓనర్ కావాలని ఆకాంక్షించారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ప్రతి నెలా లబ్ధిదారులకు చెకులను అందించనున్నట్టు పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రి ఇంట్లో తూటా గాయం,

- యువకుడు మృతి
- పక్కన మంత్రి కొడుకు తుపాకీ




**టి మీడియా, సెప్టెంబర్ 1, లక్నో:** కేంద్రమంత్రి కౌశల్ కిషోర్ ఇంట్లో ఓ యువకుడు తలకు తూటా గాయంతో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతదేహం పక్కన మంత్రి కుమారుడు వికాస్ కిషోర్ పేరుతో లైసెన్స్ ఉన్న తుపాకీ ఉంది. లక్నో నగరానికి సమీపంలోగల ఠాకూర్ గుంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెగారియా గ్రామంలో గల మంత్రి నివాసంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడు వినయ్ శ్రీవాస్తవ మంత్రి కుమారుడు వికాస్ కిషోర్‌కు స్నేహితుడుగా పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, క్రైమ్ బ్రాంచ్ పోలీసులు, ఫోరెన్సిక్ బృందాలు ఘటనా ప్రాంతానికి వెళ్లి ఆధారాలను సేకరించాయి. మంత్రి కుమారుడు వికాస్ కిషోరే తన స్నేహితుడు వినయ్ శ్రీవాస్తవను కాల్చిచంపి ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కానీ మంత్రి మాత్రం ఘటన జరిగిన సమయంలో తన కొడుకు వికాస్ కిషోర్ ఇంట్లో లేడని చెబుతున్నాడు. మరోవైపు బాధితుడి కుటుంబానికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటాడని, నేరస్తులు ఎవరైనా వారికి శిక్ష పడేలా చూస్తానని మంత్రి కౌశల్ కిషోర్ వ్యాఖ్యానించాడు. కేసు దర్యాప్తు చేపట్టిన ఠాకూర్‌గంజ్ పోలీసులు ప్రాథమిక విచారణ అనంతరం ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా మంత్రి మరో కుమారుడు ఆకాష్ కిషోర్ మద్యానికి బానిసై 2020లో మరణించాడు.

# మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ

- నలుగురి మృతి



**టి మీడియా, సెప్టెంబర్ 1,ఇంఫాల్ :** మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. వరసగా మూడు రోజుల నుంచి చురచంద్‌పూర్, బిష్ణుపూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో హింసాకాండ సాగుతోంది. మెయితీల తాజా హింసాకాండలో ఇద్దరు భద్రతా సిబ్బందితో సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. హింసాకాండ జరుగుతున్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా అదనపు భద్రతాదళాలను మెయితీ మహిళా గ్రూపులు అడ్డుకుంటున్నాయి. మెయితీలు తమ ఆధిపత్య ప్రాంతాల్లో మోర్టార్ షెల్స్ వంటి అధునాతన ఆయుధాలతో దాడికి పాల్పడుతున్నారని కుకీలు తెలిపారు. ఈ దాడిలో తమ గ్రామాలు ధ్వంసమయ్యాయని, గ్రామ రక్షణ కోసం నియమించిన పలువురు గార్డులు మరణించారని, అనేకమంది గాయపడ్డారని కుకీ గ్రూపులు తెలిపాయి. ఖౌసాబుంగ్, కుంగ్వాయి, సుగ్ను ప్రాంతాలు దాడికి గురయ్యాయని పేర్కొన్నాయి. భద్రతా సిబ్బందిపైనా కాల్పులకు మెయితీ గ్రూపులు తెగబడుతున్నాయి. ఈ దాడులకు వ్యతిరేకంగా చురచంద్‌పూర్ బంద్‌కు కుకీ గ్రూపు ఇండిజినియస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ (ఐటీఎల్ఎఫ్) పిలుపునిచ్చింది. తాజా మృతుల్లో ఒక సంగీతకారుడు కూడా ఉన్నారు. కుకీలను ఉత్తేజపరిచేవిధంగా 'ఇది మా భూమి కాదా..' అనే పాటను స్వరపరిచిన ఎల్ఎస్ మంగోబ్‌రు (42) మెయితీల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. మెయితీల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన మంగోబ్‌రును ఆసుపత్రికి తీసుకుని వెళుతుండగా మరణించినట్లు కుకీ సంఘాలు తెలిపాయి.


# యువతకు ఉపాధి కల్పించేందుకే ఐటీ హబ్

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి




**టి మీడియా, సెప్టెంబర్ 1,నల్లగొండ :** పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు నల్లగొండకు చెందిన ఎన్నారైలు.. ఐటీ హబ్‌లో తమ కంపెనీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్ రెడ్డి రూ.95 కోట్లతో నల్లగొండకు ఐటీ హబ్ మంజూరు చేశారని తెలిపారు.ఐటీ హబ్‌లో నియామకాల కోసం మెగా జాబ్ మేళా నిర్వహించగా 12 వేల మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు.మొత్తం 3,600 మందికి అవకాశాలు వస్తాయన్నారు. ఇప్పటివరకు 15 కంపెనీలు వచ్చాయి. మొత్తం 50 కంపెనీలు భవిష్యత్తులో రానున్నాయని స్పష్టం చేశారు. నల్లగొండకు ఐటీ హబ్ కొత్త అందాన్నిచ్చి, మణిహారంలా నిలిచిందన్నారు.గత కాంగ్రెస్ నాయకులు ఐటీ హబ్ తెస్తాం అని చెప్పి మాట తప్పారని విమర్శించారు. నల్లగొండ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ మరోసారి అవకాశం ఇచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజార్టీతో గెలిచి మరిన్ని అభివఅద్ధి పనులు చేస్తామని పేర్కొన్నారు. నల్లగొండలో ప్రగతి ఆగకూడదంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బీహార్ మాజీ లోక్‌సభ ఎంపికి జీవిత ఖైదు



**టీ మీడియా, సెప్టెంబర్ 1,న్యూఢిల్లీ :** 1995 జంట హత్యల కేసులో బీహార్ మాజీ లోక్‌సభ ఎంపి ప్రభునాథ్ సింగ్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం జీవిత ఖైదు విధించింది. 28 ఏళ్ల నాటి హత్య కేసులో ప్రభునాథ్ సింగ్‌ను 2017లో దోషిగా నిర్ధారణ కావడంతో.. జార?ండ్‌లోని హజారీబాగ్ జైలులో ఉన్నారు. బీహార్‌లోని మహారాజ్‌గంజ్, సరన్, సివాన్ ప్రాంతాల్లో ఆయనను ఉగ్రవాదిగా పరిగణిస్తారు. సరన్ జిల్లాలోని మస్రఖ్ నియోజకవర్గానికి చెందిన జనతాదళ్ ఎమ్మెల్యే అశోక్ సింగ్ జులై 3, 1995న పాట్నాలోని ఆయన అధికారిక నివాసంపై జరిగిన బాంబు దాడిలో మరణించారు. అసెంబ్లీ ఎన్నికలలో అశోక్ సింగ్ ప్రభునాథ్ సింగ్‌ను ఓడించారు. ఆగ్రహించిన ప్రభునాథ్ 90 రోజుల్లో అశోక్‌సింగ్‌ను చంపేస్తానంటూ బెదిరించారు. దీంతో పోలీస్ భద్రత కల్పించాలంటూ అశోక్ సింగ్ డిజిపిని కోరారు. పోలీస్ స్టేషన్ నుండి ఇంటికి తిరిగి వెళుతుండగా బాంబు దాడి జరిగింది.అశోక్ సింగ్ భార్య చాందినీ సింగ్ ఫిర్యాదు మేరకు ప్రభునాథ్ సింగ్, ఇతర నిందితులపై పాట్నా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం 1997లో సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి పాట్నాలో కేసు దర్యాప్తును ప్రభునాథ్ ప్రభావితం చేయగలరన్న ఆరోపణలతో ఈ కేసు అప్పటి అవిభక్త బీహార్‌లోని పాట్నా నుండి హాజరీబాగ్‌కు బదిలీ చేశారు. ప్రభునాథ్ సింగ్ రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ అత్యంత సన్నిహితు డు.

# భారత స్వాతంత్ర్య సమరం

మొదటిపేజీ తరువాయి..

గాంధీ ఏ బలహీనతలు లేని మనిషి. నేను అనేక బలహీనతలున్నవాడిని..” అని మండేలా చెప్పుకున్నారు. నేటికీ యావత్ ప్రపంచాన్ని గాంధీ సిద్ధాంతం ప్రభావితం చేస్తున్నది. గాంధీ చూపిన అహింసామార్గంలో స్వాతంత్రోద్యమం విజయ తీరం చేరింది అని కేసీఆర్ అన్నారు.

**గాంధీ మార్గంలో ఉద్యమించడం వల్లే తెలంగాణ**

స్వాతంత్ర సమర ఆశయాల వెలుగులోనే అంబేద్కర్ మహాశయుడు భారత రాజ్యాంగాన్ని రూపొందించారని సీఎం పేర్కొన్నారు. భారత రాజ్యాంగం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఆధునిక విలువలకు వేదికగా నిలుస్తున్నది. గాంధీ మార్గంలో, రాజ్యాంగ పరిధిలో ఉద్యమించడం వల్లనే తెలంగాణ రాష్ట్ర స్వప్నం సాకారమైంది. పోరాటం గమ్యాన్ని ముద్దాడింది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం అంటే హింసాత్మక ఆందోళన అనే అభిప్రాయం ఉండేది. టీఆర్ఎస్‌ను స్థాపించినపుడు అహింసాయుత ఉద్యమం ద్వారా, రాజ్యాంగ పరిధిలోనే ఉద్యమించి విజయం సాధిస్తామని నేను స్పష్టంగా ప్రకటించాను. మొదట కొందరు నాతో ఏకీభవించలేదు. కానీ రానురాను అందరూ నేను ఎంచుకున్న మార్గమే సరైనదని అంగీకరించారు. వెంట నడిచారు. ప్రాణాన్ని పణంగా పెట్టయినా సరే లక్ష్యాన్ని సాధించాలి తప్ప, అహింసా మార్గాన్ని వీడకూడదని నేను నిర్ణయించుకున్నాను. ఆ నేపథ్యంలోంచి వచ్చిందే ఆమరణ నిరాహార దీక్ష ఆలోచన అని కేసీఆర్ వివరించారు.

**తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది..** స్వతంత్ర పోరాటకాలంలో బ్రిటిష్ పాలనే బాగుందని అన్న ప్రబుద్ధుల వంటివారు తెలంగాణ ఉద్యమకాలంలోనూ ఉన్నారని కేసీఆర్ తెలిపారు. వారు తెలంగాణ వద్దు.. సమైక్య పాలనే ముద్దు అని నిస్సిగ్గుగా ప్రకటిస్తూ, ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. మన చిత్తశుద్ధి ముందు వాళ్ల ప్రయత్నాలన్నీ విఫలం కాక తప్పలేదు. విచిత్రం ఏమిటంటే వాళ్లే ఇవాళ మనకు తెలంగాణ ఉద్యమం గురించి పాఠాలు చెప్పడానికి సిద్ధపడుతున్నారు. తెలంగాణ ఉద్యమం ఆదర్శవంతమైనది అయినట్టే.. తెలంగాణ పరిపాలన కూడా స్వాతంత్ర్య పోరాట ఆశయాలకు అనుగుణమైనదే. స్వతంత్ర భారతంలో ఏనాడూ లేని విధంగా వ్యవసాయ సంక్షోభాన్ని పరిష్కరించాం. రైతు బంధు వంటి పథకాల ద్వారా రైతన్నల కళ్ళలో వెలుగులు చూస్తున్నాం. గ్రామ స్వరాజ్యం, గ్రామ స్వయంపోషకత్వం దిశగా మనం ఎంతో దూరం ప్రయాణించాం. గ్రామీణ వృత్తులకు ప్రోత్సాహమిచ్చాం. గ్రామాలు సుసంపన్నంగా మారాయి. ప్రజలందరికీ మంచినీళ్ళు కూడా ఇంతకాలం ప్రభుత్వాలు ఇవ్వలేదు. కానీ తెలంగాణ రాష్ట్రం ఈ విషయంలో దేశానికి ఆదర్శంగా నిలిచింది అని కేసీఆర్ స్పష్టం చేశారు.

## ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించిన ఉత్తమ్



**టి మీడియా, సెప్టెంబర్ 1. హుజూర్ నగర్ :**
శుక్రవారం ఎంపి కెప్టెన్ ఉత్తమ్ తన నియోజకవర్గంలో బ్లాక్ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. అన్ని మండలాలు/గ్రామాల్లో ఓటర్ల జాబితా చేర్పులు/తొలగింపులు రేపు రాత్రిలోగా పూర్తి చేసి బూత్ ల వారీగా నివేదికలను పార్టీ కార్యాలయంలో అంద చేయాలని, ప్రతి 100 మంది ఓటర్ల నుండి ఒక ఓటరును సమన్వయకర్తగా ఎంపిక చేయాలని, ఒక వారంలో కాంగ్రెస్ సమన్వయకర్తలకు శిక్షణా శిబిరం నిర్వహిస్తామన్నారు. ఓటరు మ్యాపింగ్ వారంలోగా పూర్తి చేయాలని కోరారు. రేపటిలోగా అన్ని బూత్‌లలో బూత్‌ల వారీగా వాట్స్ యాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలన్నారు. నాగార్జునసాగర్ నీరు విడుదల చేయనందుకు నిరసనగా అన్ని మండలకేంద్రాలలో ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు.

## ఒకే దేశం- ఒకే ఎన్నిక'కు జనసేన మద్దతు


- నాదెండ్ల మనోహర్



**టి మీడియా, సెప్టెంబర్ 1,మంగళగిరి:** ఒకే దేశం– ఒకే ఎన్నిక విధానానికి తమ పార్టీ మద్దతిస్తోందని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడతూ..ఈ అంశంపై భాజపా పెద్దలు పవన్ కల్యాణ్‌తో ఇప్పటికే చర్చించారన్నారు. దీనిపై మరింత లోతైన చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. ఈ విధానంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని చెప్పిన మనోహర్.. ఎన్నికల సమయంలో తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈనెల 2న పవన్ పుట్టిన రోజును పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఐదు సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పార్టీ కార్యాలయంలో మెగా రక్తదాన శిబిరం, భవన నిర్మాణ కార్మికులతో కలసి సహపంక్తి భోజనం, రెల్లి కాలనీ వాసుల మధ్య పుట్టిన రోజు వేడుకలు, ఎస్సీ బాలుర వసతి గృహాలలో పెన్నులు, నోట్ బుక్స్ పంపిణీ, ప్రభుత్వ సహాయం అందని విభిన్న ప్రతిభా వంతులను దత్తత తీసుకొని వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతున్నామన్నారు.

# తెలంగాణలో గెరిల్లా గ్లాస్

- సంస్థ పెట్టుబడి: మంత్రి కేటీఆర్



**టి మీడియా, సెప్టెంబర్ 1.హైదరాబాద్ :** తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు మరో దిగ్గజ కంపెనీ ముందుకొచ్చింది. మెటీరియల్ సైన్సెస్‌లో ప్రపంచ అగ్రగామిగా ఉన్న గొరిల్లా గ్లాస్ తయారీ కంపెనీ తెలంగాణలో తయారీ ప్లాంట్‌ను సెటప్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇవాళ మంత్రి కేటీఆర్ సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు.ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా తెలియజేశారు. ఆ సంస్థ రూ. 934 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. 800 మందికి ఉపాధిని కల్పించనున్నట్లు తెలిపారు. కాగా, అమెరికా పర్యటనలో మంత్రి కేటీఆర్ ఉన్న సంగతి తెలిసిందే.తెలంగాణలో పెట్టుబడుల కోసం అంతర్జాతీయ కంపెనీలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారిగా స్మార్ట్‌ఫోన్‌ల కోసం గొరిల్లా గ్లాస్‌ను తయారు చేయడానికి తెలంగాణలో తయారీ ప్లాంట్‌ను నెలకొల్పాలని నిర్ణయించుకున్నందుకు సంతోషంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

## టీ-హబ్‌లో యూకే ప్రభుత్వ చీఫ్ సైంటిఫిక్ సలహాదారు



**టీ మీడియా, సెప్టెంబర్ 1, హైదరాబాద్ :** యునైటెడ్ కింగ్‌డమ్ ప్రభుత్వ చీఫ్ సైంటిఫిక్ సలహాదారుతో పాటు అక్కడి ప్రతినిధుల బృందం శుక్రవారం టీ-హబ్‌ను సందర్శించింది. ఈ బృందంలో యూకే ప్రభుత్వ చీఫ్ సైంటిఫిక్ సలహాదారు ప్రొఫెసర్ ఎంజిలా డేమ్ మ్యాక్‌లీన్‌తో పాటు పలువురు టీ-హబ్‌లోని స్టార్టప్ కార్యకలాపాలను ప్రత్యేకంగా పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్ వారితోసమావేశమై పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో లైఫ్ సైన్సెస్, మౌలిక వసతులు, మైనింగ్, కృత్రిమ మేధస్సు టెక్నాలజీ వంటి కీలకమైన అంశాల్లో కలిసి పనిచేసేందుకు ఆసక్తి చూపినట్లు టీ-హబ్ ప్రతినిధి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా భాగస్వామ్యం కుదుర్చుకునే ఆలోచన ఉందని యూకే ప్రతినిధుల బృందం పేర్కొంది.